www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 ఆగస్టు 2025

డిగ్రీ కళాశాలల్లో సాధారణ బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నినదిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సాధారణ బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బదిలీలతోపాటు అధ్యాపకుల రీడిజిగ్నేషన్, సిఎఎస్ వంటి విషయాలపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్, గవర్నమెంట్ కాలేజ్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. జిసిటిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం.రాంబాబు, ట్రెజరర్ టివి.దుర్గాప్రసాద్, జిసిజిటిఎ జిల్లా ట్రెజరర్ కె.రమేష్, ఇతర అధ్యాపకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖాకీలపై కనికరం లేదాయే..!

ఎన్నికల్లో పోలీసులకు కూటమి నేతల ఎడపెడా హామీలు

కానిస్టేబుల్ కొడుకుగా పోలీసులకు న్యాయం చేస్తానని పవన్‌కల్యాణ్ వాగ్దానం

ఏడాది దాటినా సరెండర్ లీవ్స్, టిఎ, డిఎ బకాయిలకు అతీగతీ కరువు

ఒక్కో ఉద్యోగికీ రూ.రెండు నుంచి రూ.మూడు లక్షలకుపైగా సొమ్ము పెండింగ్

వీక్లీఆఫ్ హామీ అమలుపై కూటమి సర్కార్ మౌనం

రెండు జిల్లాల్లో దాదాపు 3,500 మందికిపైగా పోలీసుల అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్‌కు పోలీసులపై కనికరం లేకుండాపోయింది. ఎన్నికల్లో పోలీసులకు ఎడాపెడా హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఏడాది దాటినా పట్టించుకోని పరిస్థితి ఉంది. తాను కానిస్టేబుల్ కొడుకునని, అధికారంలోకి వచ్చాక పోలీసుల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు తనకు ఏమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని పోలీస్ సిబ్బందిలో చర్చ సాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 3,500 మంది వరకూ కానిస్టేబుళ్లు ఉండగా, మరో 200 మంది సిఐలు, ఎస్ఐలు ఉన్నారు. పోలీస్‌లు వేళలతో సంబంధం లేకుండా నిత్యం విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆరోగ్యాలను ఫణంగా పెట్టి ఉద్యోగ బాధ్యతల్లో మునిగి తేలుతారు. అలాంటి పోలీస్ సిబ్బంది పట్ల కూటమి సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పోలీస్ సిబ్బందికి ఇవ్వాల్సిన సరెండర్ లీవ్స్, టిఎ బిల్లుల బకాయిలు సైతం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోంది. పోలీసులకు సరెండర్ లీవ్స్ కింద ఏడాదికి 45 రోజులు వేతనం అదనంగా ఇస్తారు. ఈ సొమ్ములు మూడు విడతలుగా జనవరి, జులై, నవంబర్ నెలల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఏడాదిన్నరగా సరెండర్ లీవ్స్ సొమ్ము పోలీస్ సిబ్బందికి ఇవ్వని పరిస్థితి ఉంది. దీంతో ఒక్కో ఉద్యోగికి రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల సొమ్ము ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. ఈ సొమ్ములొస్తే పిల్లల చదువుల కోసం ఉపయోగించుకోవాలని పోలీస్ సిబ్బంది ఎదురుచూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. పోలీస్ సిబ్బందికి టిఎ ఖర్చుల కింద నెలకు రూ.2,500 వరకూ ప్రభుత్వం అందిస్తోంది. ఎస్ఐ స్థాయి అధికారులకైతే నెలకు రూ.4,500 వరకూ వస్తోంది. ఏడాదిగా టిఎ సొమ్ము ప్రభుత్వం చెల్లించలేదు. రూ.లక్షల సొమ్ము ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నప్పటికీ రాకపోవడంతో పోలీస్ సిబ్బంది నానాయాతన పడుతున్నారు. మూడు డిఎ బకాయిలపై బకాయిలపై ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేకుండాపోయింది. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తమను మోసం చేశారంటూ పోలీసుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. తమ పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నారు.

వీక్లీ ఆఫ్ అమలు చేయరు.. టర్మ్ డ్యూటీలతో నరకం

తాము అధికారంలోకి వస్తే పోలీస్ సిబ్బందికి వీక్లీ ఆఫ్ (వారాంతపు సెలవు) ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా ఇప్పటికీ వీక్లీఆఫ్ గురించి ప్రభుత్వం నోరుమెదపడం లేదు. పాలన ముగిసే సమయంలో చివరి ఏడాదిలో అమలు చేస్తారా అంటూ పోలీస్ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీక్లీ ఆఫ్ లేకపోవడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలవుతున్నారు. పోలీసులు లేకుండా అడుగు బయట పెట్టలేని నాయకులు.. వారి బాగోగుల గురించి మాత్రం పట్టించుకోని పరిస్థితి కన్పిస్తోంది. వీక్లీఆఫ్ ఇవ్వకపోవడమే కాకుండా విజయవాడకు టర్మ్ డ్యూటీల పేరుతో పోలీస్ సిబ్బందికి నరకం చూపిస్తున్నారు. సిఎం క్యాంప్ ఆఫీస్, గన్నవరం ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రతినెలా జిల్లాలోని పోలీస్ సిబ్బందికి టర్మ్ డ్యూటీలు కేటాయిస్తున్నారు. ప్రతి సర్కిల్ పరిధిలో పది నుంచి 12 మంది సిబ్బంది వరకూ టర్మ్ డ్యూటీలు చేస్తుంటారు. ఈ డ్యూటీ 15 రోజులు చేయాల్సి ఉంటుంది. టర్మ్ డ్యూటీలు చేస్తున్న పోలీస్ సిబ్బందికి అక్కడ ఎటువంటి వసతులూ కల్పించడం లేదు. తినడానికి తిండి, ఉండడానికి చోటు కూడా ఇవ్వరు. సొంత ఖర్చులతో 15 రోజులు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. దీంతో రోజుకు రూ.500కుపైగా ఖర్చవుతోంది. అంతేకాకుండా ఆరోగ్యం దెబ్బతింటుంది. టర్మ్ డ్యూటీలు రద్దు చేయాలని పోలీస్ సిబ్బంది కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పోలీసులకు ఇచ్చిన ఏఒక్క హామీనీ కూటమి సర్కార్ పట్టించుకోవడం లేదు. కానిస్టేబుల్ కొడుకునని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మౌనం వహించడంపై పోలీస్ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించేది లేదు

పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలు 268

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేసి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వితోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, ఎస్‌డిసి కె.భాస్కర్, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, సర్వే శాఖ ఎడి అన్సారీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన జనం 268 ఫిర్యాదులను అందించారన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంలో సరైన జవాబుదారీతనంతో ఉండాలన్నారు. పరిష్కరించిన అనంతరం సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారి ధ్రువీకరణ అనంతరం ఫిర్యాదులను ముగించాలని అధికారులకు సూచించారు. అలా చేయడం వల్ల సంబంధిత శాఖల అధికారులకు మండలస్థాయిలో ఫిర్యాదులపై పూర్తి అవగాహన, వారిచ్చిన ఎండార్స్‌మెంట్ క్వాలిటీ తెలుస్తుందన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత కనబరచాలని, అర్జీలు రీఓపెన్ లేకుండా శ్రద్ధ వహించాలని అన్నారు. అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించినా సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిల కోసం జోరు వర్షంలో ఆందోళన

ఎపి వ్యకాస ఆధ్వర్యాన ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

నినదిస్తున్న ఉపాధి కూలీలు, నేతలు

పేదలకు పిడికెడు మెతుకులు పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పివి.రామకృష్ణ విమర్శించారు. ఉపాధి హామీ కూలీలు బకాయిలు ఇవ్వాలని కోరుతూ స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం జోరు వర్షంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలని కోరారు. మూడు, నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు నానావస్థలు పడుతున్నారని మండిపడ్డారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల కూలీలు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు విడుదల చేయకపోతే పేదలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.307 ఇస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్భాటంగా చెప్పినా అమలుకు నోచుకోలేదన్నారు. కేంద్రబడ్జెట్‌లో నిధుల కోత వల్ల వంద రోజులు పని చూపడం లేదని, కనీసం 30 రోజులు కూడా పనులు దక్కడం లేదని ఆరోపించారు. పని చేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా ఆ ఊసే లేదన్నారు. తక్షణం బకాయిలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, నేతలు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, యు.వెంకటేష్, సత్యనారాయణ, కె.దుర్గ, చలపతి, ఎ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాటాకుతో అల్లికలు, బొమ్మలు భళా

త్వరలో మహిళలకు తాటాకులతో హస్తకళా నైపుణ్య శిక్షణ : హస్తకళా ఉత్పత్తులను పరిశీలించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

డ్వాక్రా మహిళల జీవనోపాధి మెరుగుపర్చేందుకు ఈ నెల 18 నుంచి తాటాకులతో హస్తకళా నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కొంతమంది మహిళలు తాటాకుతో తయారు చేసిన పలు హస్తకళ ఉత్పత్తులను ఆమె జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్‌డిఎ ఆధ్వర్యాన చింతలపూడి, లింగపాలెం మండలాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి మెరుగుపర్చే కార్యక్రమంలో భాగంగా తాటాకులతో అల్లికల ద్వారా పూల బుట్టలు, టోపీలు, దండలు, పూలబొకేలు, ఇతర బొమ్మలు తయారు చేసే హస్త కళాకారులకు చింతలపూడిలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం వారు తయారు చేసిన వస్తువులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించడం, డిఆర్‌డిఎ ఎగ్జిబిషన్లకు పంపించి వాటికి మరింత ఆదరణ, గిరాకీ కలిగేలా చేస్తామన్నారు. తయారీదారులకు అవసరమైన బ్యాంకు, ఇతర రుణ సదుపాయం కల్పించడంపై వారు మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

నూతన సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వినూత్న

ప్రజల సమస్యలను పరిష్కరించడమే తొలి ప్రాధాన్యతగా పని చేస్తానని నూతన సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తెలిపారు. ఆమె సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వినూత్న విలేకరులతో మాట్లాడుతూ తన తొలి పోస్టింగ్ ఇక్కడేనని సంతోషం వ్యక్తం చేశారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందేలా ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమాన్ని జవాబుదారీతనంతో మెరుగ్గా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. పిజిఆర్ఎస్‌కు అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

వంద అడుగుల జాతీయ జెండాతో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

వంద అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు

ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియం నుండి సెట్‌వెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం నుండి ప్రారంభమై ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు వంద అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఎస్‌పి పి.శ్రావణ్‌కుమార్, జిల్లా పర్యాటక సంస్థ మేనేజర్ పట్టాభి, సెట్‌వెల్ సిఇఒ కె.ప్రభాకరరావు, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు, ఇతర అధికారులు, పలు విద్యా సంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకొని సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి

పోలవరం నుండి 1,45,797 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

గోదావరి నీటిమట్టం సోమవారం స్వల్పంగా పెరిగింది. మూడు రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి వస్తున్న 1,45,797 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. స్పిల్వే ఎగువన 27.550 మీటర్లు, స్పిల్వే దిగువన 17.680 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 27.660 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 16.800 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 15.890 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

మత్స్యశాఖాధికారి నిర్ణయం ప్రకారం ముందుకు

నిడమర్రు తహశీల్దార్ వి.దుర్గాప్రసాద్ : 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

అక్రమ చేపల చెరువును పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చెరువు ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడుతున్న అధికారుల బృందం

నిడమర్రు మండలం అడవికొలను రెవెన్యూ పరిధిలోని తిమ్మారావుగూడెంలో ప్రభుత్వ మురుగు కాల్వ ఆక్రమించుకుని తవ్విన చేపల చెరువులోని ఆక్రమణలు తొలగించేందుకు జిల్లా మత్స్య శాఖాధికారి అనువైన తేదీని నిర్ణయించాల్సి ఉందని, ఆ ప్రకారం రెవెన్యూ సిబ్బంది చెరువులో కలిపేసుకున్న మురుగు కాల్వను వేరు చేసేందుకు సహకరిస్తామని నిడమర్రు తహశీల్దార్ వి.దుర్గాప్రసాద్ తెలిపారు. 'అక్రమ చేపల చెరువుపై చర్యలు తీసుకునేనా' అంటూ సోమవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. తిమ్మారావుగూడెం గ్రామం సర్వే నెంబర్ 148 నుంచి 163 వరకూ ఉన్న 70 ఎకరాల చేపల చెరువులో సర్వే నెంబర్ 159-4లో 94 సెంట్లు ప్రభుత్వ మురుగు కాలువ ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించినట్లు ఆయన వివరణ ఇచ్చారు. ఆక్రమణకు గురైన మురుగు కాల్వ సరిహద్దులు నిర్ణయించామన్నారు. మురుగు కాల్వ ఇరిగేషన్ పరిధిలోనిది కావడంతో సదరు ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా మత్స్యశాఖ అధికారి ఆక్రమిత రైతులకు జులై 31వ వరకూ గడువు ఇస్తూ నోటీసు జారీ చేశారన్నారు. సదరు గడువు ముగిసినందున తిరిగి మురుగు కాలువ ఆక్రమణలు తొలగించి సరిహద్దులు ఏర్పాటు చేసే వరకూ సదరు చెరువులో ఎటువంటి సాగూ చేపట్టకూడదని ఆక్రమిత రైతులకు తెలియజేశామన్నారు. విఆర్ఒ, విఆర్ఎలతో కలిసి సదరు చెరువులో ఎటువంటి సాగూ చేపట్టకుండా నిఘా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. సదరు చెరువుపై ఉన్న విద్యుత్ మీటర్ల విషయమై ఎపిఇపిడిసిఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ వారికి గతంలో తమ కార్యాలయం నుండి లేఖ పంపించినట్లు తెలిపారు.

అక్రమ చేపల చెరువును పరిశీలించిన మండలాధికారులు

ప్రభుత్వ మురుగు కాలువను ఆక్రమించుకున్న అక్రమ చేపల చెరువు ఖాళీ అయ్యిందని, వెంటనే చెరువు ధ్వంసానికి చర్యలు తీసుకోవాలని వచ్చిన ఫిర్యాదులు, ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో సోమవారం మండలంలోని వివిధ శాఖల అధికారుల బృందం సదరు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆక్రమిత చెరువులోని రైతులతో మాట్లాడారు. తదుపరి తీసుకునే చర్యలను వివరించినట్లు తెలిసింది. ఈ బృందంలో ఆర్ఐ సుబ్బారావు, మత్స్యశాఖ మండలాధికారి రవికుమార్, విద్యుత్‌శాఖ మండలాధికారి వి.ప్రసాద్, విఆర్ఒలు, విఆర్ఎలు, గ్రామ మత్స్యశాఖ అధికారి ఉన్నారు.

మాతృభాషలో బోధనే శ్రేయస్కరం

హేలాపురి బాలోత్సవ ఐదో పిల్లల సంబరాల సావనీర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సావనీర్‌ను ఆవిష్కరించిన ప్రముఖులు

పిల్లలకు మాతృభాషలోనే విషయాలు త్వరగా అర్థమవుతాయని, అందుకోసం మాతృభాషలోనే బోధనపై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య అన్నారు. హేలాపురి బాలోత్సవం ఐదో పిల్లల సంబరాలు సావనీర్ ఆవిష్కరణ సభ స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. సభకు హేలాపురి బాలోత్సవం నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు స్వాగతం పలుకగా, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో సావనీర్‌ను ప్రముఖ వైద్యులు డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, దీపక్ నెక్సజన్ ఫీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, నాగహనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ టెక్నికల్ డైరెక్టర్ టి.భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు భాషతోపాటు ఇతర భాషలూ నేర్చాలి తప్ప తెలుగును మరుగునపర్చేలా భాషా విధానం ఉండరాదన్నారు. పిల్లల కోసం నిర్వహిస్తున్న బాలోత్సవంలో అనేక సంస్థలు, సంఘాలు, పెద్దలు, దాతలు, భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు. సభాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ 2019లో అమరావతి బాలోత్సవం ప్రోత్సాహంతో ప్రారంభించిన హేలాపురి బాలోత్సవం దిగ్విజయంగా సాగుతుందన్నారు. ఐదో పిల్లల సంబరాలు సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్లో గత జనవరిలో ఉత్సాహభరిత వాతావరణంలో పూర్తి చేసుకున్నామన్నారు. ఆ బాలోత్సవం విశేషాలు, చిత్రాలు, సమీక్షలతోపాటు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉపయోగపడే సమాచారంతో సావనీర్‌ను ముద్రిస్తున్నామన్నారు. మరింత ఉత్సాహంగా మరిన్ని కొత్త కొత్త అంశాలతో పిల్లలను ప్రోత్సహించేలా ఆరో బాలోత్సవం నిర్వహణకు అందరూ తోడ్పడాలని కోరారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ యాజమాన్యం అంగీకరిస్తే పర్మినెంట్‌గా ఇక్కడే బాలోత్సవాలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ కోనేరు సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యాలయాల్లోని పరిమితుల రీత్యా బాలోత్సవం అనేది పిల్లల్లో వివిధ అంశాల పట్ల ఆసక్తిగా ఉండడానికి, ఆ సందర్భంగా నేర్చుకునే అవకాశం పెంచుతుందని అన్నారు. తమ విద్యాసంస్థలో ఇలాంటి కార్యక్రమం ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చక్కగా నిర్వహించిన కమిటీకి అభినందనలు తెలిపారు. పని దినాల ఇబ్బంది లేకుండా ఉంటే తమ సంస్థలో బాలోత్సవం నిర్వహించుకోవడానికి ఆనందదాయకమేనన్నారు. టి.భాస్కర్ మాట్లాడుతూ బాలోత్సవాలు నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి ఒక ముఖ్యమైన కార్యక్రమంగా ఉన్నాయన్నారు. కొండ్రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ తమ సంస్థ విద్యార్థులను ప్రోత్సహించే అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. కైకలూరులో కూడా మానవత కమిటీ చొరవతో ఈ సంవత్సరం నుండి కొల్లేరు బాలోత్సవం నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. అమరావతి బాలోత్సవం నాయకులు యువి.రామరాజు మాట్లాడుతూ ఏలూరు బాలోత్సవం అనేక అనుభవాలను రాష్ట్రానికి అందిస్తోందని, అభ్యుదయ ఆలోచనలు పెంచడం కోసం పిల్లలకు వివిధ అంశాల్ని రూపొందించి నడుపుతోందని అన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలోత్సవాల్లో పాల్గొన్న పిల్లలందరూ ఇక్కడ పొందిన అనుభూతి చిరకాలం గుర్తుంటుందన్నారు. ఆహ్వాన సంఘం ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల, సిద్ధార్థ స్కూల్ డైరెక్టర్ కోనేరు సిద్ధార్థ, గోద్రెజ్ ఆగ్రో వెట్ కన్సల్టెంట్ ఎంఎస్ఎంఎస్.కుమార్, అభినయ నృత్య భారతి ప్రధాన కార్యదర్శి డి.హేమసుందర్, సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ ప్రిన్సిపల్ సీమా మహంతి, వై.ఆనందనాయుడు, పీడీ.రత్నాకర్‌రావు, ఎస్.కస్తూరిరావు, వి.సురేష్‌కుమార్, మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

సిఐటియు 13వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నూజివీడు పట్టణంలో తొలిసారి జరగబోయే సిఐటియు 13వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి భుజంభుజం కలిపి సిఐటియు కృషి చేస్తుందన్నారు. ఎన్నికల ముందు అంగన్వాడీల సమస్యలపై 42 రోజులు చారిత్రాత్మక సమ్మెను సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పని చేసే ఉద్యోగుల కోసం సిఐటియు పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు కోసం చేపట్టిన ఆందోళనలకు అండగా నిలిచామన్నారు. సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనకు సిఐటియు సంఘీభావం తెలిపిందన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జరిగే జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి జి.రాజు, నాయకులు ఎన్ఆర్.హనుమాన్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎఐతో ఫిర్యాదుల స్వీకరణ సులభతరం

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫిర్యాదులను సేకరించామని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించడం సులభతరం అవుతుందని, అంతేకాకుండా వాటిని పరిష్కరించేందుకు కూడా డిజిటల్ ప్రక్రియలో సాధ్యమవుతుందని చెప్పారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులకు, వారి సహాయకులకు సత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా ఉచిత భోజన సౌకర్యం కల్పించామని తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు బాలబాలికలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిరాదరణకు గురై వసతి గృహాల్లో ఒంటరిగా జీవిస్తున్న బాల బాలికలను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చే కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి శ్రీకారం చుట్టారని, అందులో భాగంగా నగరంలో చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించామని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఎం.సుబ్బారావు తెలిపారు. నగరంలోని పాఠశాలలో వసతి గృహాలు, చైల్డ్ వెల్ఫేర్ సెంటర్లు, వన్ స్టాప్ సెంటర్లు వంటి వాటిలో ఆయా నిరాదరణకు గురైన బాల బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించే కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి 30 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని పలు వసతి గృహాల్లో నిరాదరణకు గురైన అనేకమంది బాల బాలికలతో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ, శక్తి టీమ్ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఇలా వివరాలు సేకరించిన ఇద్దరు బాలురను, ఇద్దరు బాలికలను సోమవారం సాయంత్రం సిఐ సుబ్బారావు చైల్డ్ వెల్ఫేర్ సమక్షంలో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాలతో ఈ ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఒంటరిగా జీవిస్తున్న పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. మరింత మంది వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

వివిధ మండలాలకు బదిలీ అయిన నారాయణపురం గ్రామ సచివాలయ ఉద్యోగులకు సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద చిరు సత్కారం చేశారు. గ్రామ సర్పంచి అలకనంద, పంచాయతీ కార్యదర్శి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఉద్యోగులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. అంకితభావంతో పనిచేస్తూ ఉద్యోగులు ఎక్కడ ఉన్నా ప్రజల మన్ననలు పొందాలని సర్పంచి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ విజయ్, వార్డు సభ్యులు ఆశీర్వాదం, జనసేన నాయకులు బొమ్మిడి అనిల్‌కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పిఎం దృష్టికి పామాయిల్ రైతుల సమస్యలు

ఎంపి పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పామాయిల్ రైతుల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి, ముఖ్యంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నామని, కేంద్ర మంత్రులు, అధికారులు కూడా వీటిపై సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు. ఏలూరు పార్లమెంటు పరిధిలోని చింతలపూడి, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలతోపాటు ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైన్ నిర్మాణం కోసం కూడా పట్ల సంతోషకరమని పేర్కొన్నారు. ఇటీవల రైల్వే మంత్రిని కలిసినప్పుడు డిపిఆర్ తయారైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 12 ఆర్‌ఒబిల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. కైకలూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లేరు మీదుగా వెళ్లే మరో నాలుగు ఆర్‌ఒబిలకు కూడా అనుమతి కోరుతూ తాజాగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. పొగాకు రైతులను ఆదుకోవాలన్న అంశాన్ని కేంద్ర వాణిజ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వచ్చే వారంలోగా ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పామాయిల్‌కు ఫిక్స్‌డ్ ధరను నిర్ణయించి ఆయిల్ పామ్ రైతులను ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

భీమడోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజతో పాటు నియోజకవర్గ అధికారి వినయ్‌కుమార్ నాయకత్వం వహించారు. జాతీయ జెండాలు చేత పట్టుకుని భీమడోలు పురవీధుల మీదుగా ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు యుగంధర్, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడినవారికి నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రమాద సమయంలో వెంటనే స్పందించి ప్రాణాలు కాపాడిన ఇద్దరు వ్యక్తులను కైకలూరు రూరల్ సిఐ వి.రవికుమార్ సన్మానించి నగదు ప్రోత్సాహకాలు అందించారు. గత నెల 29వ తేదీన హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి చేబ్రోలు వెంకటేశ్వరరావు దంపతులు హైదరాబాద్ నుంచి బింగోలు (?) గ్రామానికి కారులో వస్తుండగా ముదినేపల్లి సమీపంలో కాలువలో కారు బోల్తా పడిన ఘటనలో వెంకటేశ్వరరావు మృతి చెందారు. సకాలంలో స్పందించి ఆయన భార్య కృష్ణకుమారిని కాపాడిన అన్నాయం చెందిన సుబ్బయ్య, అనంతరాయపేటకు చెందిన పల్లం ఆంజనేయులను సోమవారం సత్కరించారు. ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున కృష్ణకుమారి కుమారులు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు

రహదారికి అడ్డంగా విరిగిపడిన చెట్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం-కొరుకొల్లు రహదారిలో జానకిగూడెం వద్ద ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు ఒక చెట్టు రహదారిపై అడ్డంగా విరిగిపడింది. దీంతో రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.వి.వీరభద్రరావు మటీనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో రాత్రికి రాత్రే చెట్టును తొలగించారు. దీనికి తోడు విద్యుత్ తీగలు కూడా తెగిపడటంతో గ్రామస్తులు భయాందోళనలు చెందారు. గ్రామానికి చెందిన ఎర్రా రాంబాబు ట్రీ కటింగ్ మిషన్ తెప్పించి చెట్టును కట్ చేసి రోడ్డుపై నుంచి తొలగించారు.

నేరాలు - ఘోరాలు

గూడ్స్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోలవరం

గూడ్స్ క్యారియర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గూటాలలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గూటాల గ్రామానికి చెందిన ఐతేపల్లి అనంత పద్మారావు(57) తన బైక్‌పై తాళ్లపూడి వెళ్లి తిరిగి గూటాల వస్తుండగా గూటాల గ్యాస్ పైపులైన్ వద్దకు వచ్చేసరికి పోలవరం నుంచి తాళ్లపూడి వైపు వెళ్తున్న గూడ్స్ క్యారియర్ వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని తాళ్లపూడి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలవరం పోలీసులు మృతదేహాన్ని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ భీమశేఖర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నేడు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో ఈ నెల 12వ తేదీ మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పిజె.అమృతం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలోవిద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాని జిల్లాలోని వైద్యాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సిడిపిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమ హాస్టల్ అధికారులు వంద శాతం అమలు చేయాలని పేర్కొన్నారు.

భీమడోలు :గుండుగొలను పిహెచ్‌సి పరిధిలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని వైద్యులు జాహ్నవి రెడ్డి, డాక్టర్ శరణ్య కోరారు. కార్యక్రమం ముందస్తు చర్యల్లో భాగంగా పురవీధుల్లో అధికారులు, సిబ్బంది మధుసూదనరావు, రామకృష్ణ, ఇందిర, మురళి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామం ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 84 విద్యాసంస్థలకు చెందిన 11,430 మందికి నులి పురుగు నివారణా మాత్రలను అందించడం లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సదరు మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు విద్యాసంస్థల్లో అందించేందుకు చర్యలు తీసుకున్నామని, మాత్రలను వేసే విషయంలో ఆరోగ్య కేంద్రం సిబ్బందితో పాటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల, సిబ్బంది సహకారం కోరామన్నారు. 12వ తేదీన మాత్రలను తీసుకోని వారికి తిరిగి ఈనెల 20వ తేదీన అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సర్క్యులర్ రద్దు కోరుతూ నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యాసంస్థల్లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు ఆధ్వర్యాన స్థానిక కోటదిబ్బ జూనియర్ కళాశాల బయట విద్యార్థులు నిరసన తెలిపారు. సర్క్యులర్ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నగర అధ్యక్షుడు ఎం.యశ్వంత్, తేజ, అశోక్, కుమార్, ప్రదీప్, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గత సంవత్సర కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు మండలాల అధ్యక్షులను ఆదేశించారు. బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో జరిగే అభివృద్ధి పనుల పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అధికార ప్రతినిధి జి.రవికుమార్, ఏడు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రవర్తన సరికాదు

టిడిపి సీనియర్ నేత కాపా శ్రీనివాసరావు

ప్రజాశక్తి నూజివీడు టౌన్

పోలీసులు విచక్షణ మరచి విచిత్రంగా ప్రవర్తించడం దారుణమని టిడిపి సీనియర్ నేత, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, రావిచర్ల గ్రామ సర్పంచి కాపా శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయాల పట్ల పోలీసుల వ్యవహార తీరు దారుణంగా ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో నేటికీ అనాధికా వస్తున్న సాంప్రదాయాలు కొనసాగుతున్నాయని, అందులో భాగంగానే ఎవరైనా మృతి చెందిన సమయంలో వారికి ఇష్టమైన క్రీడలను ప్రదర్శిస్తుంటారని అది ఆయా కుటుంబాలకు, గ్రామాలకు ఉన్న నమ్మకానికి సంబంధించిన అంశం అన్నారు. ఇలాంటి నమ్మకాలను సైతం అవహేళన చేసే రీతిలో ఉన్న పోలీసుల తీరు సహించలేనిదన్నారు. రావిచర్లలో కోడిపందెం వేయకుండానే ఆగిరిపల్లి మండలం నుంచి పోలీసులను పిలిపించి అక్కడ ఉన్న వారిని అత్యంత దారుణంగా మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు వెనక్కి కట్టి వారి జేబులో నుంచి డబ్బులు తీయడం దారుణమన్నారు. నిజంగా కోడిపందెం వేసి ఉంటే ఆ తీరు వేర, పోలీసులు చెప్పగానే పందెం నిలిపివేసి ఎవరి పనుల్లో వారు ఉన్నప్పటికీ ఇంతటి దారుణంగా పోలీసులు వ్యవహరించడం ఏంటన్నారు. ఇలాంటి పరిస్థితులను సహించేది లేదని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన సందోలు బెంజిమెన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన కేతిరెడ్డి సీతారామిరెడ్డి చంద్ర కాంతమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు) సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ముప్పన స్రవంతి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉనికిలో అన్న సమారాధన

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోని ఉనికిలో గంగానమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం అన్న సమారాధనను ఘనంగా నిర్వహించారు. ఉనికిలి ఎస్‌సి కాలనీలో సుస్థిర నివాసులై కొలువైన గంగానమ్మ జాతరలో అన్న సమారాధనను కూర్మ కొండలరావు, కృష్ణకుమారి దంపతులు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యాత్రికులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గంగానమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిడిపి బిసిల పార్టీ : ఎంఎల్‌ఎ చింతమనేని

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి అంటే బిసిల పార్టీ అని, గ్రామ సర్పంచి నుంచి చట్టసభల వరకు బిసిలు ప్రాతినిధ్యం వహిస్తుం డడంలో నందమూరి తారక రామారావు చేసిన కృషి ఎనలేని దని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరులోని డిసిఎంఎస్ ఫంక్షన్ హాలులో దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధన్యవాద సభలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెల్లవారుజామునే లేచి వర్షాకాలమైన సరే అలుపెరగక క్షమించే కష్టజీవులు గీత కార్మికులని అన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ఉండగా గీత కార్మికులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి చంద్రన్న బీమా ద్వారా రూ.ఐదు లక్షలు ఇచ్చి ఆదుకున్నామన్నారు. గత వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి రూ.పది లక్షలు ఇస్తామని ప్రకటించి 47 మంది గీత కార్మికులు చనిపోతే కనీసం వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. 50 ఏళ్లకే గీత కార్మికులకు పెన్షన్ అందించే కార్యక్రమాన్ని కూడా పునరుద్ధరించిందనట్లు తెలిపారు. గీత కార్మికులకు గొర్రెలు, మేకలు పెంచుకోవడానికి కూడా తాను పూర్తి సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. నియోజకవర్గంలో కేటాయించే బారును గౌడ సంఘీయులకు చెందేలాగా చూస్తానని హామీ ఇచ్చారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నట్లు సబ్ కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్లైన్ చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జఠిలమైన సమస్యలు పరిష్కారం కాకుంటే వాటి వివరాలను అర్జీదారులకు వివరిస్తామన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 26 రకాలైన సమస్యలను అర్జీల రూపంలో అందించినట్లు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుని వద్దకు వచ్చి అర్జీ స్వీకరించిన సబ్ కలెక్టర్

నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న బయటకు వచ్చి వికలాంగుని వద్ద అర్జీ స్వీకరించారు. పుట్టుకతో వికలాంగుడైన ఓ వ్యక్తి అర్జీ తీసుకొని రావడాన్ని సిబ్బంది ద్వారా తెలుసుకున్న సబ్ కలెక్టర్ హుటాహుటిన బయటకు వచ్చి అతని వద్ద అర్జీని స్వీకరించారు. సమస్యను అడిగి తెలు సుకుని వికలాంగుడైన వ్యక్తికి ట్రై సైకిల్ అందించేందుకు తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు ఆత్మీయ వీడ్కోలు

స్మరణ్‌రాజ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

నూజివీడు టౌన్ :నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తహశీల్దార్లు మాట్లాడుతూ తక్కువ సమయంలో అందరి ఆత్మీయత పొందారన్నారు. శాంతియుత మార్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించి ఉన్నతాధికారుల ప్రశం సాలు పొందారన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్‌గా అంకుటిత దీక్షతో అహర్ని శలు శ్రమించి ప్రజలకు తనదైన శైలిలో అసాధారణ సేవలను అందించారని కొనియాడారు. సాధారణ బదిలీలో భాగంగా నూజివీడు నుంచి వేరొక ప్రాంతానికి బదిలీ అయిన స్మరన్‌రాజ్ అందరికీ ఆదర్శనీయమన్నారు.

మూడు సొసైటీలకు ఛైర్మన్ల ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాగరాజు
మధ్యాహ్నపువారిగూడెం

సత్యనారాయణ
కె.జగ్గవరం


వినయ్, మల్లుకుంట

మండలంలోని ఐదు సొసైటీల్లో మధ్యాహ్నపు వారిగూడెం సొసైటీకి జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, మల్లుకుంట సొసైటీకి టిడిపి రాష్ట్ర కార్యదర్శి సీలం వెంకటేశ్వరరావు తనయుడు శీలం వినయ్, కె.జగ్గవరం సొసైటీకి సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్లుగా ఎంపికయ్యారు. వారితో పాటు పర్సన్లుగా మధ్యాహ్నపువారిగూడెం సొసైటీకి దాసరి నాగదుర్గారావు, ఎం.రవి, మల్లుకుంట సొసైటీకి యాదవ ఎద్దుల వెంకటేశ్వరరావు, తలారి ఆంధ్రబాబు, కె.జగ్గవరం సొసైటీకి పిజెబి విఘ్నేశ్వరావు, పొలిమెర వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. కాగా మక్కినవారిగూడెం, టి.నరసాపురం సొసైటీలకు ఎంపిక జరగాల్సి ఉంది.

కె.జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ గా బొంతు బాధ్యతలు

మండలంలోని కె. జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్‌గా సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సొసైటీల త్రిసభ్య కమిటీలో కె.జగ్గవరం సొసైటీకి చైర్ పర్సన్‌గా బొంతు సత్యనారాయణ, పర్సన్లుగా పిజెబి.విగ్నేశ్వరావు, పొలిమెర వెంకటేశ్వరరావు ఎంపి కయ్యారు. వారు స్థానిక కూటమి నాయకుల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, మండలాధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, మాజీ సర్పంచి గుమ్మళ్ల బాలరాజు తదితరులు ఉన్నారు.


బాధ్యతలు చేపట్టిన కె.జగ్గవరం సొసైటీ ఛైర్మన్ సత్యనారాయణ

అక్రమ రొయ్యల చెరువులు పూడ్చివేయాలి

కలెక్టర్‌కు వరి రైతుల ఫిర్యాదు

పచ్చని పొలాల మధ్య రొయ్యల చెరువు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పచ్చని పంట పొలాల మధ్య అనుమతులు లేకుండా తవ్విన రొయ్యల చెరువులను అధికారులు వెంటనే పూడ్చివేయాలని పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఏలూరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. మండలంలోని సింగరాయపాలేనికి చెందిన వల్లభనేని రామకృష్ణకు, కాకరవాడకు చెందిన మరీదు రాజారావుకు కాకరవాడలో వ్యవసాయ భూములు ఉన్నాయి. కాకరవాడలో ఆర్‌ఎస్ నెంబర్ 18, 19లో అనుమతులు లేకుండా 12 ఎకరాలు కొత్తగా ఒక రైతు రొయ్యల చెరువులు తవ్వినట్లు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చెరువులపై ఉప్పునీటి కోసం బోర్లు వేస్తున్నారని, దీంతో పక్కనే ఉన్న 150 ఎకరాల వరి పొలాలకు చాలా నష్టం వాటిల్లుతుందన్నారు. ఉప్పునీటి కారణంగా పక్కనే ఉన్న వరి చేలకు పంట దిగుబడులు తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. కొత్తగా తవ్విన ఈ రొయ్యల చెరువులకు మురుగునీరు బయటకు పోయే అవకాశం లేదన్నారు. అనుమతులు లేకుండా తవ్విన రొయ్యల చెరువులను వెంటనే పూడ్చి వేసి బోర్లు కూడా పీకించి వరి పొలాలకు నష్టం లేకుండా చూడాలంటూ కలెక్టర్‌ను కోరారు. రొయ్యల చెరువులకు కరెంటు కనెక్షన్ కోసం దరఖాస్తు చేశారని, కనెక్షన్ ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరారు. అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు తవ్విన సదరు వ్యక్తిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

మా సమస్యలు పరిష్కరించండి

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ పారిశుధ్య కార్మికులు మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్ ఖాతాలకు డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. వాటితో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏజెన్సీల పేరిట దళారుల వ్యవస్థను కొనసాగించడం ప్రభుత్వానికి సహేతుకం కాదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జంపన వెంకటరమణరాజు, సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ (బాబు), ఎఐటియుసి నాయకులు రాజు, మేరీ, చంద్రకళ, దమయంతి, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమమే కూటమి ధ్యేయం

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నేతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. ఎంతో నైపుణ్యత కలిగిన చేతి వృత్తులపై ఆధారపడి వాటికి జీవం పోస్తున్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ఏలూరు 30వ డివిజన్‌లోని బ్రహ్మంగారి ఆలయం వద్ద నేతన్నకు అండగా కూటమి ప్రభుత్వం పేరుతో సోమవారం సభను నిర్వహించారు. నేతన్న భరోసా పథకంలో భాగంగా ఏడాదికి రూ.25 వేల మేర చేనేత కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూర్చే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ సభలో ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం పలువురు చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి భరోసా కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దానిలో భాగంగానే నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్లు, చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు ఐదు వందల యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. చేతివృత్తుల వారిని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

శ్రీ శోభనాచల మరియు మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానం

ఆగిరిపల్లి - దేవదాయ, ధర్మాదాయ శాఖ

భూమి కౌలు హక్కు ప్రకటన

ఆగిరిపల్లి గ్రామములో గల శ్రీ శోభనాచల మరియు మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం తాలుకా భూమి దిగువన ఉదహరించిన భూమి 3 సంవత్సరముల కాల పరిమితికి అనగా 2025-2026 నుండి 2027-2028 వరకు లీజుకు ఇచ్చుటకు అధికారుల సమక్షములో బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరణ	తేదీ, సమయం, ప్రదేశం	ధరావత్తు	స్వభావము
1.	R.S.No.248 య.5.00 వద్దమాను Hill ఏరియా	ది.21-08-2025వ తేదీ ఉ.10.00 గంll దేవస్థానం కార్యాలయం నందు	15,000/-	(కొండ ఏరియా) మెరక

ఇతర విషయములకు కార్యాలయం నందు గాని ఫోన్ ద్వారా గాని 9848146455 తెలుసుకొనవచ్చును.

ఆగిరిపల్లి, తేది.08-08-2025 సం/- కార్యనిర్వహణాధికారి

మహిళల ఆర్థిక స్వావలంబనకు ముందడుగు

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఇందు కోసం రూ.మూడు వేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించిందని పేర్కొన్నారు.

'ఆంక్షలు లేని ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఆంక్షలు లేకుండా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని వైసిపి మండల నాయకులు పెండ్యాల అభిషేక్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర నలుమూలల ఎక్కడికైనా చేయవచ్చని నమ్మబలికి అధికారంలోకొచ్చాక అదీ సంవత్సరకాలం గడిచిన తర్వాత ఆంక్షలతో ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్భాటంగా శ్రీకారం చుట్టి మహిళలను మోసగిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆటో యూనియన్‌లతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని ఆటో డ్రైవర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఆటో యూనియన్‌లతో చర్చించి వారికి ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక భరోసాను ల్పించాలని పేర్కొన్నారు.

గీత కార్మికులకు మద్యం, బార్ షాపుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కల్లు గీత కార్మికులకు పది శాతం మద్యం షాపులు, బార్ షాపులు కేటాయించిన ఏకైక ప్రభుత్వం కూటమి అని నూజివీడు నియోజకవర్గ కల్లుగీత కార్మికులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వి.గురుమూర్తి అన్నారు. కల్లుగీత కార్మికులకు 50 సంవత్సరాలకే పింఛను అందించడంతోపాటు కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల్లో కూటమి ప్రభుత్వం పది శాతం రిజర్వేషన్లు కేటాయించినందుకు గురుమూర్తి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం నుంచి ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేశారు. అనంతరం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎనిమిది మంది గీత కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక నాయకులు, ఎ.శ్రీను, ఎం.రామకృష్ణ, పి.కోటేశ్వరరావు, బాబూరావు, సత్యనారాయణ, మల్లికార్జునరావు, రాంబాబు, టిడిపి వి.శ్రీనివాస్, వేణు పాల్గొన్నారు.

23 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభ

ఏలూరు అర్బన్ :సిపిఐ 28వ రాష్ట్ర మహాసభ ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. ఏలూరు సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ నాయకులు మహాసభ వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శ్రీనివాస్ డాంగే పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం తాళ్ళచెరువు గ్రామానికి చెందిన కేత వీరాస్వామి అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. వంకతాళ్ళచెరువు ఇంటి దగ్గర నుండి ఆచంట సెంటర్‌కు వెళ్తుండగా నాయొక్క పాస్ పోర్ట్ నంబర్ : N0752767 గల పాస్ పోర్ట్ ఏవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కేత వీరస్వామి, తండ్రి : నరసింహ మూర్తి
డోర్ నెం : 14 - 37, వంకతాళ్ళ చెరువు
ఆచంట మండలం
సెల్ : 9502455557

ఒరిజినల్ దస్తావేజు పోయినది

కృష్ణాజిల్లా పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం కాపురస్తులు బోడ హేమంత్, తండ్రి శ్రీనివాసరావు, వయసు. 31 సంవత్సరాలు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం, ఇంటి స్థలంకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు నెంబర్ 1568/1989 (ఏలూరు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్)లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు, ది 08-08-2025 న, శనివారపుపేట నుండి ఫైర్ స్టేషన్ సెంటర్‌కి వెళ్తుండగా నా హ్యాండ్ బ్యాగ్‌తో పాటు పోయింది. దొరికిన వారు దయచేసి ఈ ఫోన్ నంబర్ కి (6302383269) కాల్ చేయగలరు. అందచేసి తగిన బహుమతి పొందగలరు.

బోడ హేమంత్, తండ్రి.శ్రీనివాసరావు
డోర్.నం.19-143, ఫ్లాట్ నం.FF-3, ఫస్ట్ ఫ్లోర్,
మాదు తిరుపతిరావు నగర్, యనమలకుదురు గ్రామం,
పెనుమలూరు మండలం, కృష్ణా జిల్లా.

పాస్‌పోర్టు పోయినది

ఉల్లంపర్తి రూనే సుశీల్, తండ్రి, స్టీఫెన్ వీరా సుధీర్, డోర్ నెంబర్ 4-5-38, క్రిష్టియన్ పేట, 31వ వార్డు, పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియ జేయునది ఏమనగా నేను ది 15-09-2016 లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి P0635375 నెంబర్ పాస్ పోర్ట్ పొందియున్నాను. నేను ది 28-7-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లు మండలం లంకల కోడేరులో నా బంధువు వద్దకు వీసా గురించి మాట్లాడటానికి నా ఒరిజినల్ పాస్ పోర్ట్ తో బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పడి పోయినవి.ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9849671119